# వెన్నెల వాకిట్లో...

"ఇందూ! సంభ్రమాశ్చర్యానందాలతో వెలిగిపోయింది మాధవి ముఖం. తనను చుట్టేస్తున్న మాధవి చేతుల మధ్య యిమిడిపోయి హాయిగా నవ్వింది ఇందిర. చటుక్కున ఇందిరను వదిలేసి గంభీరంగా పడమటి వైపుకు తిరిగి కెంజాయ రంగు చీర ధరించిన సంధ్యను చూస్తూంది మాధవి.

"ఇప్పటి దాకా బాగానేవున్నావు కదే? ఏమిటలా చూస్తున్నావ్" కంగారు నటించింది ఇందిర.

"డోన్ట్ డిస్టర్బ్! ఈ రోజు సూర్యుడెటు పొడిచాడా అని పరిశీలిస్తున్నాను. ఇన్ని నెలల తరువాత మా ఇందిరమ్మ యింత తీరికగా కరుణించిన వైనం మీద నివేదిక సమర్పించబోతున్నాను."

"పిచ్చీ"

"మేధావుల్ని చూచి పిచ్చిలోకం కళ్లుకుట్టి ఇదే బిరుదునిస్తుంది. డోంట్ బాదర్. ఇంతకూ యివాళీ విశాల ప్రపంచంలోకి ఎలా రాగలిగావు?" ఇందిర చెయ్యి పుచ్చుకుని అఫీసు బయటకు వస్తూ అడిగింది మాధవి.

"ఏంటనుకుంటున్నావ్ మనమంటే? మూడురోజులు వీరోచితంగా పోరాడి సాధించుకొచ్చాను. ఎల్లుండి ఉదయం దాకా నేను పంజరం బయట జోరుగా, హుషారుగా ఎగరడానికి పర్మిషన్ దొరికింది." సంతోషంగా, నిజంగా విను వీధుల్లో విహరిస్తున్నంత హాయిగా వుంది ఇందిర ముఖం.

"మైగాడ్! ఎల్లుండి ఉదయం దాకా? అంటే సుమారు నలభై గంటలు!!" సరదాగా మాట్లాడుతున్నా, ఇందిర సంతోషం చూస్తుంటే వాడి ముల్లు హృదయంలో దిగి బడినట్లుగా వుంది మాధవికి. పి.జి. సెంటర్‌లో లిటరేచర్ ఎం.ఏ చేస్తున్న ఇందిర కోరి వరించి వచ్చిన ఆనంద్‌ని పెళ్ళాడి చదువుకు మధ్యలోనే మంగళ హారతి పాడేసింది. బి.ఏ. యూనివర్సిటీ సెకండ్ వచ్చిన ఇందిర ఉజ్జ్వలమైన భవిష్యత్తును పాడుచేసుకుని అంత త్వరగా పెళ్ళిచేసు కోవడమే పెద్ద తప్పటడుగని మాధవి అభిప్రాయం. ఆనంద్ అలవాట్లతో, జీవితవిధానంతో ఆమె రాజీ పడలేకపోవడం, అతని కుటుంబ వాతావరణంలో యిమిడిపోలేక పోవడం మరింత విషాదకరం. ఎం.ఏ. చేసి, రీసెర్చి చేసి సాహిత్యంలో ఒక కొత్త చరిత్ర సృష్టించాల్సిన ఇందిర ఒక్కరోజు తనకు నచ్చిన రీతిలో తన ఆత్మీయులతో గడపడానికి భర్త అనుమతి కోసం పోరాడవలసిరావడం!! చదువుకుని ఆలోచన, చైతన్యం వున్న ఆడపిల్లే ఈ స్థితిలో వుంటే మామూలు ఆడపిల్ల సంగతి!! ఆలోచిస్తూంది మాధవి.

"ఏమిటే, నీ వాలకం చూస్తూంటే నా కేదో అనుమానంగా వుంది. ఆ సంతోషం, అంతలోనే కళ్ళు వాలిపోవడం, పరధ్యానంలోకి జారిపోవడం, ఎంత కష్టమొచ్చి పడిందే నీకు మధూ!" తమాషాగా నిట్టూర్చింది ఇందిర.

"నీ జాలివాన తరువాత కురిపించుదువుగాని, ముందు మంచు మీగడ తినిపిస్తాను పద"

"మంచు మీగడ?!" ప్రశ్నార్థకంగా చూసింది ఇందిర.

"ఎస్. ప్రశస్తమైన క్వాలిటీ ఐస్ క్రీమ్."

"ఐస్‌క్రీమ్! మన మహా పట్టణంలో!"

"అవును మన కాకినాడ మహాపట్టణంలోనే. అదిగో ప్రభుత్వ ధర్మాసుపత్రి.

దాని ఎట్టెదుట అదే ఎయిర్ కండిషండ్ ఐస్‌క్రీమ్ రెస్టారెంట్.'' ఒక రేకుల షెడ్‌లోకి దారి తీసింది మాధవి. ఇద్దరు అతి చురుకైన పిల్లలు ఆనందంగా, ఉత్సాహంగా దెబ్బలాడుకుంటున్న వాళ్లల్లా, పోటీపడుతూ ఆర్డర్ కోసం పరుగెత్తుకొచ్చారు. బహు సంతోషంగా ఐస్‌క్రీమ్ కప్స్ తీసుకొచ్చి పెట్టి యథాస్థానానికి వెళ్ళి మళ్ళీ దెబ్బలాటను ద్విగుణీకృతోత్సాహంతో కొనసాగిస్తున్నారు.

''ఇప్పుడు చెప్పు. ఏమిటి విశేషాలు?''

''ఏముంది! పగలంతా నడుమెత్తకుండా చాకిరీ, రాత్రంతా పతి దేవుడి కోసం జాగరణ.''

''ఏమిటి నువ్వనేది?'' చప్పున ఇందిర చేతినందుకుని జాలిగా చూసింది మాధవి.

''ఏమిటే యివి నీ చేతులేనా? ఇంత గరుగ్గా వున్నాయేం?'' గులాబీరేకుల్లా మృదువుగా, మెత్తగా వుండే ఇందిర చేతులు యింత గరుగ్గా అవడానిక కారణం అంతులేని చాకిరియే ననుకునేసరికి మాధవి గుండె వణికింది.

''మా ఇంట్లో నేను స్పెషల్‌గా 'డిగ్నిటీ ఆఫ్ లేబర్' ని పాటిస్తాను. అంచేత కొంచె గట్టి పడ్డాయంతే'' అరచేతులు చాచి చూచుకుంటూ తేలిగ్గా నవ్వేసింది ఇందిర.

'మీ ఇంట్లో మీ అత్తగారు, తోడికోడలు, ఆడపడుచు - నువ్వు కాక ముగ్గురు ఆడవాళ్లుండగా నువ్వే ఎందుకలా నడుం విరిచేసుకునే ఉద్యమాన్ని చేపట్టావు?''

''భేషైన ప్రశ్న వేశావు. మా అత్తగారు నిత్యరోగి. మా తోడికోడలు బాలింత చూలింత పదవుల్ని నిర్విఘ్నంగా నిర్వహిస్తూంది. ఇంక మా ఆడపడుచు సదా మేఘాల అంచున విహరిస్తూ వుంటుంది. ఏ ఐ.ఏ.యస్. ఆఫీసరో, బ్యాంక్ ఆఫీసరో మెడలో పూలమాల వేసి తనను తీసుకుపోతాడని కలలు కంటూ అంట్లుతోమడం, బట్టలుతకడం లాంటి డర్టీ పనులు చెయ్యడం తన హోదాకు భంగమనుకుంటుంది. ఇంక మిగిలిందెవరు? హర్ హైనెస్ ఇందిరాదేవి గారేకదా!'' గలగలా నవ్వింది ఇందర.

''అంత ఒళ్లు వంగని వాళ్లు పని మనిషిని పెట్టుకోవచ్చుగదా!'

''పని మనిషా! అనగా నేమి? అదేజాతి? మాయింట్లో ఎవరైనా పనికి కుదిరి పది రోజులకుపైగా నిలబడితే, వాళ్లకు మరో ఆలోచన లేకుండా 'పద్మవిభూషణ్'

బిరుదునివ్వొచ్చు."

"అదేం? ఆశ్చర్యంగా చూచింది మాధవి.

"అదంతే, పనిమనిషిని చూడగానే మా అత్తగారికి ఎక్కడి రోగాలక్కడ గప్‌చిప్! పూనకం వచ్చినట్లు ఆ గిన్నె శుభ్రంగా కడగలేదనో, ఈ గది సరిగ్గా ఊడవలేదనో తిట్లకు లంకించుకుంటుంది. ఆవిడ వయసులో పాటించిన వీరశుభ్రాన్ని ఏకరువు పెడుతుంది. మా తోడికోడలు మహావీరావేశంతో ఊగిపోతూ ఛడామడా తిట్టేస్తూ పనులు పురమాయిస్తుంది. మా ఆడపడుచు వీళ్లిద్దరికన్నా రెండాకులెక్కువ చదివింది. కాబోయే కలెక్టర్‌గారి భార్య గదా, అంతా యమ డిసిప్లిన్. జీతం యిరవై రూపాయలిస్తూ అన్నం, పచ్చళ్లు, కూరలు దానికెందుకివ్వాలని యుద్ధానికి దిగుతుంది. చుట్టూ తలుపులేసి చావచితకదన్నితే పిల్లైనా పులవుతుంది గదా! ఎంత అమాయకురాలూ, మంచిదీ, అయిన మనిషైనా సరే చేరిన నాలుగోరోజున ముఖం మీద నాలుగూ కడిగేసి 'మీకో దణ్ణం, మీ పనికో దణ్ణం' అని పారిపోతుంది" ఐస్‌క్రీమ్ తినడం ఆపి రెప్పవాల్చడం మరిచి వింటూంది మాధవి.

"ఆ గయ్యాళి గంపలలా ప్రళయ తాండవం చేస్తూంటే మీ ఇంట్లో మగ ధీరులు కాస్త మందలించి దారిలో పెట్టరా?"

"సరి పోయింది నీ అజ్ఞానం నువ్వూను. మా ఇంట్లో ఎవరి దారి వారిదే. ఒకరి అంతరంగిక విషయాల్లో మరొకరు జోక్యం చేసుకోరు. మామగారు మహాభక్తులు. ఎప్పుడూ భజనలు, అధ్యాత్మిక ప్రసంగాలతో బిజీబిజీగా వుంటారు. అల్పమైన ప్రాపంచిక విషయాలు, క్షుద్రమైన గృహసమస్యలకు దూరంగా వుంటారాయన. ఇంక మా బావగారు క్లబ్బు, ఆఫీసు, ఎప్పుడో నాలుగు రోజులకోసారి స్నానం అవసరమైతే ఇల్లు, అయనకిలాంటి పెట్టీ విషయాలంటే ఎలర్జీ. మా మరిదికి నిద్రలో మెలకువలో, సర్వావస్థల్లోనూ ఏకైకలోకం క్రికెట్"

"మరి నీ డియర్ హజ్బెండ్..."

"ఆగాగు. వస్తున్నా. అంత తొందరైతే ఎలా?" ఐస్‌క్రీమ్ గబగబ తినేసి కర్చీఫ్‌తో పెదాలను అద్దుకుంది ఇందిర.

"ఇందు గలడందు లేడని సందేహము వలదన్నట్లుగా నా ప్రియమైన భర్త గారికి స్నేహితులులేని చోటు లేదు. వారికి పగలు, రాత్రి అనే భేదం లేదు. పడగ్గదిలో పడుకునుండగానైనా సరే ఫ్రెండొచ్చి 'ఆనంద్' అంటే చాలు, ఆనందంగా తలుపు

తీసుకు వెళ్లిపోతారు. పునర్దర్శనం మళ్లీ ఎప్పటికో!!" ఇందిర కళ్లల్లో పలచటి నీడలు.

"బావుంది. చాలా అందంగా వుంది" యథాశక్తి తన ఆనందాన్ని ప్రకటిచింది మాధవి.

"ఆఫీసవగానే ఫ్రెండ్స్‌తో షికార్లు, మందు పార్టీలు, అర్ధరాత్రికో, తెల్లవారు ఝామునకో నిషాలో కొంపకు చేరడం, అప్పటిదాకా తిండి తినకుండా కునికిపాట్లు పడతూ కూర్చోవడం నేను."

"నిన్ను చూస్తే నాకు జాలిగా లేదే, కోపం నషాలానికంటుతోంది." అంది మాధవి. బిల్లు చెల్లించి బయటపడ్డారిద్దరూ. చల్లని గాలి అల మాధవిని శాంతపరచింది.

"అలా కబుర్లు చెప్పుకుంటూ నడుద్దామా!" అడిగింది మాధవి.

"రాజమండ్రి నుంచి పనిగట్టుకుని వచ్చిందెందుకే? కబుర్లు చెప్పుకోవ డానిక్కాకపోతే ముసుగెట్టి నిద్రపోవడానికా?"

"అది సరే, రోజూ అర్ధరాత్రి, అపరాత్రి ఇంటికి చేరితే నీకెలా తోస్తుందను కుంటాడా పెద్దమనిషి?"

"నా అనుమానం మా ఆయన దృష్టిలో నేను ఆయన కనుసైగలననుసరించి మెలగాల్సిన అందమైన కుక్కపిల్లనని. ఆయన పనులన్నీ నేనే చెయ్యాలి. ఇంట్లో వున్నంత సేపూ ఆయన్ని అంటిపెట్టుకునే వుండాలి. ఇంకోతమాషా ఏమిటో తెలుసా? ఎప్పుడైనా ఆయన ఇంటి కొచ్చేసరికి నేను లేననుకో, యింక యిల్లు పీకి పందిరేస్తారు. ఏం మగాళ్లో ! నా కోసం పది నిమిషాలు వెయిట్ చెయ్యడానికి పెద్ద రాద్ధాంతం చేసే మనిషి, తన కోసం నేను గంటల కొలదీ వెయిట్ చెయ్యడాని కెంత చచ్చిపోతానో అర్థం చేసుకోరు. మాట్లాడితే ఫ్రెండ్స్. ఏం, ఈయన కొక్కరికేనా ఫ్రెండ్సుండేది?! అందరూ యిలాగే పెళ్ళాల్నేడిపించి ఊరుమీద బలాదూరు తిరుగుతున్నారా?... యివన్నీ ఎప్పటికీ జవాబు దొరకని ప్రశ్నలుగా మిగిలిపోతా యమేమోనని భయంగా వుంది నాకు." ఇందిర గొంతు సన్నగా కంపించింది. ఓదార్పుగా ఆమె భుజంమీద చెయ్యేసి మృదువుగా తట్టింది మాధవి. ఇందిర సర్దుకునేవరకు మౌనం వహించింది.

"బుర్రనిండా సెంటిమెంటల్ నాన్సెన్స్‌ని నింపుకుని అనవసరంగా ఆరోగ్యాన్ని

పాడు చేసుకుంటున్నావే ఇందూ! ఆ మహానుభావుడొచ్చేదాకా కళ్లల్లో వత్తు లేసుకునెందుక్కూర్చోవాలి నువ్వు? సుబ్బరంగా కడుపు నిండా తిని ముసుగు పెట్టుకు పడుకోక శివరాత్రి జాగరణల్నెవరు చెయ్యమన్నారు నిన్ను? ఇంత వెర్రి నాగమ్మలా నువ్వు ప్రవర్తిస్తావని కలలో కూడా అనుకోలేదే." అంతలో పిఠాపురం రాజావారి కాలేజి వచ్చింది. ఎన్నో రోజుల తరువాత కనిపించిన ఆత్మబంధువును చూచినట్లు చూస్తూంది ఇందిర.

"నా మాట విని అంట్లు తోముడు, బట్టలుతుకుడు, కార్యక్రమాలలో టైమ్ వేస్ట్ చెయ్యకుండా ఎమ్.ఏ. ప్రైవేట్‌గానన్నా పూర్తిచెయ్యి."

"పూర్తి చేసి..."

"పూర్తి చేస్తే, నీ పతిదేవుడి పాదపూజ యింకెంత బాగా చెయ్యొచ్చో, ఇరవై నాలుగ్గంటలూ ఇంటి పనులు చేసుకోవడంలో ఎంత తన్మయత్వాన్ననుభవించవచ్చో యింకా బాగా అర్థమవుతుంది. ఆనక నీకు 'ఉత్తమగృహిణి' కంకణాన్ని బహూకరించి సత్కరిస్తారు." చిరాగ్గా చూసింది మాధవి. ఇందిరేదో చెప్పేలోగా సుధిత బుక్ సెంటర్‌కు వెళ్ళి మేనల్లుడికి పుస్తకాలు కొంది మాధవి.

"పద, ఒకసారలా డిస్ట్రిక్ట్ సెంట్రల్ లైబ్రరికి వెళ్లి తరువాత సూర్యకళామందిరానికి వెళ్దాం. మా బాస్ కూతురి డాన్స్ ప్రోగ్రాముంది ఈ రోజు. అటెండెన్స్ వేయించు కోకపోతే అగ్గిరాముడౌతాడాయన. అలా వెళ్లి పదినిమిషాలు కూర్చుని వెళ్లిపోదాం. సరేనా?" మాధవి అడిగింది.

"నీ యిష్టం. రేపు ప్రొద్దుట దాకా నేను నీ కేరాఫ్. తరువాత అమ్మ దగ్గరకు వెళ్తాను." సూపర్‌బజారు ముందున్న జనాన్ని చూస్తూ లైబ్రేరీకి వచ్చారు.

"అలా కూర్చుని ఈ పుస్తకం చూస్తూండు. నేనిప్పుడే వార్తా పత్రికల్లో స్కోరెంతో చూచి వచ్చేస్తా." తన చేతిలో వున్న 'వనితాజ్యోతి'ని ఇందిర చేతిలో పెట్టింది మాధవి.

"అదేమిటే క్రికెట్ మాచ్‌లు ఏవన్నా జరుగుతున్నాయా ఎక్కడన్నా"

"అంతకంటే అద్భుతమైనవి. వార్తా పత్రిక తెరిస్తే ఏమిటి కనిపిస్తాయి రోజూ? ఎక్స్‌ప్రెస్, గూడ్సు బండి ఢీ, లారీ స్కూటర్ల ద్వంద్వ యుద్ధం, లాంచీలు తిరగబడడం, విమానాలు కూలిపోవడం, సగటున పేజీకొక మానభంగం, విడివిడిగా ఒక్కొక్క దాని స్కోరు - మొత్తం స్కోరు, వెరశి మన దేశాభ్యుదయం"

మాధవి మాటలకు చిన్నగా నవ్వింది ఇందిర. గబగబ పేపర్లు తిరగేసింది మాధవి.

"పద పోదాం" లైబ్రరీ బయటికొచ్చి సూర్యకళామందిరానికి రిక్షా మాట్లాడుకుని ఎక్కారు. ఇందిరకు రెండేళ్ల క్రిందటి అందమైన రోజులు గుర్తుకొస్తున్నాయి. రోజూ తను కాలేజీకి ఈ దారినే వచ్చేది. ఫ్రెండ్సందరూ కలిసి కబుర్లు చెప్పుకుంటూ, హాయిగా నవ్వుకుంటూ, ఈ ప్రపంచాన్ని లెక్క చేసేదేమిటన్నంత ధీమాగా నడిచి వెళ్లేవాళ్ళు, గడిచిపోయిన అనుభవాలు మధురమైన కలల్లా తలపుకు వస్తున్నాయి ఇందిరకు.

రిక్షా టౌన్ హాలు దాటి 'కల్పనా టాకీస్' మలుపు తిరిగి సూర్యకళామందిరం ముందు ఆగింది. అంతా జనం, త్రొక్కిసలాట, రోడ్డుకవతలవైపున కలవారి కార్లు హుందాగా బార్లు తీర్చి వున్నాయి. రిక్షా దిగి లోపలికి వెళ్ళడానికి పెద్ద యజ్ఞమయింది.

"రసజ్ఞులైన కాకినాడ పౌరుల కళాభిమానం మెచ్చదగింది. ప్రతి ప్రోగ్రాంకి ప్రేక్షకుల కొరత మాత్రం ఎట్టి పరిస్థితుల్లోనూ వుండదు" కుర్చీలు వెదుక్కుని కూర్చున్నాక అంది మాధవి.

కాసేపు నృత్యప్రదర్శనను చూసి బయట పడ్డారిద్దరూ, వెన్నెల తీగలు నేల మీద పారాడుతున్నాయి. నిండుగా ఊపిరి తీసి వదుల్తూ ఆకాశం వంక చూచింది మాధవి.

"ఇందూ! కాసిని నక్షత్రాల్ని కోసుకుని మాల కట్టుకుని జడలో పెట్టుకుందామా?" భావుకంగా చూచింది మాధవి.

"ఊహూఁ! ముందు వెన్నెల చీర కట్టుకుందాం. మెరుపు రవ్వల్ని ముక్కున పెట్టుకుందాం. మేఘాల నలుపుని కనురెప్పలకు రాసుకుందాం. అప్పుడు నక్షత్రాల మాల కట్టుకుందాం." చిలిపిగా నవ్వింది ఇందిర.

"ఓహ్! ఇప్పటికి అర్థమయింది మనిద్దరికీ యిలా కవిత్వం పుట్టుకు రావడానికి కారణమేమిటో! ఈ వీధిలోనే ప్రసిద్ధ కవి 'ఇస్మాయిల్' గారుండేది."

"అంతే అయుంటుంది. ఆయన కవితా కన్య చిరు కపోలాన్ని స్పృశించిన గాలి మనల్ని తాకి బహుశా..." అంతలో రాఘవేంద్రస్వామి ఆలయం మలుపు తిరిగి విజయలక్ష్మీనర్సింగ్ హోమ్ వైపు మళ్లారు.

"గాలి మారింది. యింక కవిత్వం రాదు మందుల వాసనొస్తుంది." గలగలా

నవ్వింది మాధవి.

"ఇందూ! ఒక్క నిముషం, డాక్టర్ గారికోమాట చెప్పొస్తా!" అంటూనే లోపలకు దూసుకుపోయింది మాధవి. నర్సింగ్ హోమ్ ముందున్న విగ్రహాన్ని చూస్తూంది ఇందిర. బిడ్డను ఒడిలో పెట్టుకుని అన్నం తినిపిస్తున్న మాతృదేవి. ఎంత చక్కగా మలిచాడు శిల్పి.

"రా!రా! బస్సొచ్చేస్తూంది." తదేకంగా విగ్రహం వైపు  చూస్తున్న ఇందిర చెయ్యి పుచ్చుకుని రోడ్డు కవతల వైపుకు లాక్కెళ్లింది మాధవి. బస్సు ఆగడం, ఫీట్ చేస్తూ లోపలికి జొరబడడం, కాసేపు కథాకళి ప్రాక్టీస్ చేస్తూండగానే మెడికల్ కాలేజీ స్టాపులో ఆగడం జరిగాయి. మాధవనగర్‌లో చిన్న పెంకుటింటి వాటాలో మాధవి నివాసం.

"నా సొదలో పడి అడగడమే మరిచిపోయాను. అమ్మా, వదిన బావున్నారా? వేణు బాగా చదువుతున్నాడా?" అడిగింది ఇందిర.

"ఏం బావుండడం! ఎప్పటికప్పుడు బ్రతుకుతో పెనుగులాటే..." మాధవికి భయంకరమయిన తన బాల్యం, చదువుకునే రోజులు గుర్తుకు వచ్చాయి. తను కడుపులో వుండగానే తండ్రి పోవడం, యింకా పసితనం వదలని అన్నయ్య కుటుంబభారాన్ని నెత్తికెత్తుకోవడం, ఏ మూలకూ చాలని అన్నయ్య జీతం. ఏ వైపు నుంచీ మరి కొంత ఆదాయం వచ్చే దారిలేక పోవడం, తనకు పది పన్నెండేళ్ల వయసులో ఫ్యాక్టరీలో జరిగిన ప్రమాదంలో అన్నయ్య చనిపోవడం, చుట్టూ ఆవరించుకున్న చిమ్మ చీకటి, అమ్మ, వదిన కలిసి వెలుగుకోసం చేసిన భీకర పోరాటం, వద్దొద్దు, ఎవరికీ అలాంటి బ్రతుకొద్దు. తన కమ్మటి బాల్యాన్ని బ్రతుకు భయం మింగేసింది... మాధవి కళ్ళల్లో జలపాతాల హోరు.

మాధవితో తనను పోల్చి చూసుకుంటూంది ఇందిర. అమ్మ, నాన్న వున్నంతలో ఎంతో అపురూపంగా పెంచారు తనను. ఏదో సందర్భంలో తనను చూసి ఇష్టపడి పెళ్ళి చేసుకుంటానని ఆనంద్ వచ్చినప్పుడు అతని ఉద్యోగాన్ని, వెనక వున్న ఆస్తిపాస్తుల్ని చూశారే తప్ప, అతని అలవాట్లను ఆరా తియ్యలేదు. తనకు కూడా అతను తనను ఇష్టపడుతున్నాడన్న భావం పట్ల వున్న గ్లామర్ తప్ప అతని అభిరుచుల్ని, మనస్తత్వాన్ని తరచి చూసి అంతిమ నిర్ణయాన్ని తీసుకునేంత విజ్ఞత లేకపోయింది. ఉన్న జీవితం పట్ల అసంతృప్తి, లేని దాని కోసం ఆరాటం, బ్రతుకంతా నిష్ప్రయోజనంగా గడిచిపోతుందేమోన్న ఆవేదన, సహనంతో

పరిస్థితుల్ని చక్కబరుచుకోవాలన్న తపన తనను నిలవనివ్వడం లేదు. అనుక్షణం పరిస్థితులతో పోరాడుతూ, పడుతూ, లేస్తూ, గెలుపు వైపు పురోగమిస్తున్న మాధవిని చూస్తే తనకు అభిమానం, ఆప్యాయత. మాధవిని నలిపేస్తున్న ఆర్థిక సమస్యల్ని చూశాక డబ్బు యిబ్బందులేమీలేని తను చాలా మందితో పోల్చి చూస్తే అదృష్టవంతురాలననిపిస్తుంది. చివరి మాటను పైకి వెలిబుచ్చింది ఇందిర.

"అవును ఎప్పుడూ పోలికే మనిషిని బ్రతికిస్తుంది. తనకంటే అభాగ్యులున్నారు. వాళ్ళూ బ్రతకుతున్నారన్న స్పృహే మనిషిలో బ్రతకాలనే ఆశను రేకెత్తిస్తుంది. భద్రత లేని జీవితం ఒక ప్రక్క భయపెడుతున్నా, బ్రతకాలనే ఆసక్తి చచ్చిపోకుండా చూచేది పోలికే." తడిక గేటును తెరుస్తూ అంది మాధవి.

వరండాలో కూర్చున్న వ్యక్తిని చూడగానే ఇందిర చెయ్యి వదిలి ఒక అడుగు ముందుకు వేసింది మాధవి.

"ఎంత సేపయింది మీరొచ్చి... నా ఫ్రెండ్ ఇందిర. ఇతను సత్యనారాయణ. పోర్ట్‌లో వర్క్ చేస్తున్నారు." పరస్పర అభివాదాల తరువాత ముగ్గురూ కబుర్లలో పడ్డారు. మాధవి వదిన, అమ్మ వచ్చి ఇందిరను పలకరించారు. కొంచెం సేపు కూర్చొని అతను వెళ్ళిపోయాడు.

భోజనం చేసి బయటకు వచ్చారు మాధవి, ఇందిర. ఇంటి ముందు విరబూసిన సన్న జాజుల పరిమళం. కార్తీకమాసపు చిరుచలి. ఎదురింటి వారి స్టీరియో వినిపిస్తున్న లతా పాట - గమ్మత్తుగా వుంది వాతావరణం.

"కబుర్లు చెప్పుకుంటూ అలా రోడ్డు దాకా వెళ్ళొద్దామా? " మాధవి అడిగింది.

"మనకింకా స్వాతంత్ర్యం రాలేదు"

"నీ మొహం. స్వాతంత్ర్య రజతోత్సవాలు జరుపుకుని, రాష్ట్రావతరణ రజతోత్సవాల్లో వున్నాం!"

"ఉత్సవాలకేం భాగ్యం! గాంధీగారు చెప్పిన స్వాతంత్ర్యం - అదే అర్ధరాత్రి ఆడపిల్ల ఒంటరిగా వీధిలో నిర్భయంగా రాగలగడం..."

"చాల్లే! పగటిపూటే దిక్కులేదు... అయినా మన కాకినాడింకా అంత అభివృద్ధి సాధించలేదులే. ఫరవాలేదు" పయట చెంగు భుజాల చుట్టూ కప్పుకుంటూ, అడుగు ముందుకు వేస్తూ మళ్ళీ ఆగింది మాధవి.

"ఇంట్లో యిప్పుడు కబుర్లు చెప్పుకున్నామంటే తడికకు అవతల ప్రక్కన పడుకున్న ఇంటాయన బి.పి. పెరుగుతుంది. పోనీ అలా జాజి పందిరి దగ్గర చాప వేసుకుని కూర్చుందాం వుండు" ఇంట్లోకి వెళ్ళి చాప తీసుకుని వచ్చింది మాధవి. జాజిపూలు కోసి దోసిట్లో తీసుకుని వాసన చూసింది ఇందిర.

"ఈ వెన్నెల, సన్నజాజులు, మధూ, నీకేమీ అనిపించడం లేదా?" తన్మయంగా పువ్వుల వంక చూస్తూ అడిగింది ఇందిర.

"అనిపిస్తూంది" ఇందిర ఏ ఉద్దేశ్యంతో అడుగుతూందో చూచాయగా గ్రహించింది మాధవి.

"ఏమని?"

"అది వెన్నెలనీ, యివి సన్నజాజులనీ..." పెంకెగా చూచింది మాధవి.

"చాల్లే... ఇలా చదువుతూనే ముసలి దానివయిపోతావా, పెళ్లి చేసుకునే ఉద్దేశ్యమేమయినా ఉందా?" అడిగింది ఇందిర.

" ఏమే. ఏమైనా సంబంధం చూశావేంటి?" అల్లరిగా నవ్వింది మాధవి.

"బడాయిపోక నిజం చెప్పు" ఇందిర సీరియస్‌గా అడిగేసరికి ఓ నిముషం ఆలోచిస్తూ వుండి పోయింది మాధవి.

"ఇందాక అతన్ని చూశావు కదా, సత్యనారాయణని. అతని మీద నీ అభిప్రాయమేమిటి?"

"బావుంది. ఒక్క చూపుతో, నాలుగు మాటల్లో అతన్ని అంచనా వేసేంత గొప్ప దాన్ని కాదు గానీ, అసలు విషయం చెప్పు. అసలిప్పటి దాకా నాకీ వార్త నెందుకు చెప్పలేదో సంజాయిషీ యిచ్చుకో"

"ఏదీ, యింకా పూర్తిగా నిశ్చయం కానిదే! అమ్మకు, వదినకు ఇష్టం లేదు."

"ఎంచేత"

"అతనిది టెంపరరీ పోస్ట్. జీతం నా జీతం కంటే తక్కువ. వెనక బాధ్యత లున్నాయి. అతని చూపు నా మీద కంటే నా జీతం మీద వుందని అమ్మ, వదినల అనుమానం. బ్రతుకులో అన్నీ చేదు అనుభవాలే కదా. మనుషుల మీద నమ్మకాన్నే పోగొట్టుకున్నారు" విచారంగా చెప్పింది మాధవి.

"మరి నువ్వెందుకతన్ని ఎన్నుకున్నావు"

"వ్యక్తిగా అతని ఔన్నత్యాన్ని చూసి. నాలుగేళ్ళ పరిచయం అతనెంటువంటి వాడో తెలిపింది. యింకీ బ్రతుకుతో పోట్లాడే శక్తి నాకు లేదు అని నీరస పడిపోయి నప్పుడల్లా అతను నా ప్రక్కన కొండంత అండగా నిలబడి ధైర్యం చెప్పేవాడు. ఒక వ్యక్తి కష్టంలో వున్న మరో వ్యక్తికి ఇచ్చే మోరల్ సపోర్ట్ విలువెంతో అతని ద్వారా తెలుసుకున్నాను."

"ఐతే...." సందేహంగా చూసింది ఇందిర.

"అలాంటివాడి చూపు నా జీతంమీద వుందని నేననుకోను. ఒక వేళ అలా వున్నా నేను తప్పుపట్టను. సమస్యల తోరణాలు, బ్రతుకునింకొంచెం బాగు చేసుకోవాలన్న తపన, యింకాస్త సుఖంగా బ్రతకాలన్న తాపత్రయం, నాకు కాక నా ఉద్యోగానికి ప్రాధాన్యత వుండేలా చెయ్యొచ్చు! సామెత చెప్పినట్లు గొంగట్లో అన్నం తింటూ, వెంట్రుకలు వచ్చాయని బాధపడితే లాభం లేదు. పరిస్థితులలా వున్నాయి. అర్థం చేసుకుని, కొన్నింటిని సరిపెట్టుకోవాలి. అవసరమైతే ఎదురు తిరిగి, పోట్లాడి, సాధించుకునే చైతన్యాన్నీ కోల్పోకూడదు"

"నిజమేననుకో! ఐనా అక్కడా బాధ్యతలు, పెళ్ళి చేసుకున్నాకైనా హాయిగా ఊపిరి పీల్చుకోక మళ్ళీ నెత్తిమీద బరువులంటే నాకెందుకో బాగా లేదు."

"బాధ్యతలంటే నాకు భయం లేదే. అలవాటయిపోయింది"

"మరేమిటంటే భయమో?"

"మనిషిలోని దుర్మార్గం, అసూయ, కాఠిన్యం అంటే నాకు చచ్చేంత భయం. నవ్వుతూ వెన్నుపోటు పొడిచే మనుషుల్ని చూస్తే నాకు వొణుకు.."

చుక్కలు కబుర్లు చెప్పుకుంటూనే వున్నాయి. వెన్నెల కరిగిపోతూనే వుంది. కాలం కదుల్తూనే వుంది.

- 'ఆంధ్రజ్యోతి వీక్లీ', 1981